

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపర్ పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.

కర్నూలు, డోన్, ఆత్మకూరు, కల్లూరు	- 99854 09260
కర్నూలు, కోడుమూరు, నందికొట్కూరు	- 9985411379
ఆదోని, ఆలూరు, పత్తికొండ, ఎమ్మిగనూరు	- 9985171793
నంద్యాల, పాణ్యం, ఆళ్ళగడ్డ, బనగానపల్లె	- 9985411377

నాణ్యతా ప్రమాణాలను పాటించాలి

- హోటళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచాలి
- ఈవో శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఈవో శ్రీనివాసరావు

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం క్షేత్ర పరిధిలో హోటళ్ల నిర్వాహకులు పరిశుభ్రతతో పాటు నాణ్యతా ప్రమాణాలను పాటించాలని ఆలయ ఈవో శ్రీనివాసరావు హెచ్చరించారు. బుధవారం మల్లికార్జున కల్యాణమండపంలో ఈవో క్షేత్ర పరిధిలోని హోటళ్ల యజమానులతో సమావేశమయ్యారు. హోటళ్ల నిర్వాహకులకు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంటకాల్లో తాజా కూరగాయలను మాత్రమే వాడాలని సూచించారు. భక్తులకు నిల్వ ఆహారపదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. హోటళ్లలో పనిచేసే సిబ్బంది భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం నేరమన్నారు. ప్రతినెలలో రెండు సార్లు రెవెన్యూ, శానిటేషన్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లతో హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేయిస్తామన్నారు. నియమాలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. అపరాధ రుసుము మూడుసార్లు దాటితే సంబంధిత హోటల్ లీజును రద్దు చేస్తామన్నారు. ఏఈవో మల్లికార్జునరెడ్డి, ప్రజా సంబంధాల అధికారి శ్రీనివాసరావు, పర్యవేక్షకులు రాధాకృష్ణ పాల్గొన్నారు.

వీబీఆర్ నుంచి ఐదు గేట్లు ఎత్తివేత

- ప్రస్తుతం 14.929 టీఎంసీల నీరు నిల్వ
- సందర్శులకు తాకిడి



వెలుగోడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగుగంగలో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (వీబీఆర్) ఐదు గేట్లను తెలుగుగంగ అధికారులు ఎత్తి బుధవారం దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం జలాశయంలో 263.49 మీటర్ల నీటి మట్టం వద్ద 14.929 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలశాయంలోకి బనకచెర్ల సముదాయం నుంచి 13,500 క్యూసెక్కులు, మెయిన్ కెనాల్ ద్వారా 5200, స్పిల్‌వే మీదుగా 9వేల క్యూసెక్కులు, 1ఆర్ తూము ద్వారా 60 1ఎల్ తూము ద్వారా300, నంద్యాల తాగునీటి కోసం 20 క్యూసెక్కుల నీటిని చొప్పున దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. స్పిల్‌వేకు చెందిన ఐదుగేట్లను ఎత్తడంతో సందర్శకుల తాకిడి అధికమైంది. నీటి విడుదలతో గాలేరు నది పొంగిపొర్లుతుంది. నదీ పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలుగుగంగ అధికారులు సూచించారు.

ఉచిత ప్రయాణానికి సిద్ధం..!



నంద్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు కానుంది. సూపర్-6 హామీల్లో ప్రధానమైన ఉచిత బస్సు ప్రయాణంపై ఏడాదిగా మహిళలు ఎదురుచూస్తున్నారు. దీంతో ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవం రోజు నుంచి ఈ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇదే విషయంపై ఇటీవల శ్రీశైలం, నందికొట్కూరు పర్యటన సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. దీంతో జిల్లా ఆర్టీసీ అధికారులు సైతం ఆ దిశగా చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని డిపోల్లో సిబ్బంది కసరత్తు మొదలు పెట్టారు. ఉచిత ప్రయాణంతో రద్దీ పెరిగే అవకాశం ఉంది. నంద్యాల జిల్లా వ్యాప్తంగా సుమారు 1.20లక్షల మంది ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణిస్తుండగా.. ఇందులో 40 శాతం మంది మహిళా ప్రయాణికులు ఉన్నారు. ఈ లెక్కన ఆర్టీసీకి రోజుకు రూ.65లక్షలు ఆదాయం సమకూరేది. అయితే మహిళలకు ఉచిత ప్రయాణంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా నష్టం చేకూరనుంది. ఆ నష్టాన్ని ఓ వైపు భర్తీ చేస్తూనే ఉచిత బస్సు ప్రయాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించనుంది.

- సర్వీసులు, సిబ్బందిపై కసరత్తు
- బస్సులను సిద్ధం చేసే పనిలో అధికారులు
- 40 శాతం మహిళా ప్రయాణికులుగా గుర్తింపు
- ప్రస్తుతం ఆర్టీసీకి రోజుకు రూ.65లక్షలు ఆదాయం
- ప్రధాన రోడ్ల సర్వీసులపై ఆరా



నంద్యాల బస్టాండ్

డిపోల వారీగా

ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత ప్రయాణం నేపథ్యంలో జిల్లా ఆర్టీసీ అధికారులు ఎక్కడిక్కడ ఆయా పనుల్లో నిమగ్నమయ్యారు. దీంతో ఎక్కడిక్కడ బస్సులు.. సర్వీసులు.. సిబ్బంది అడ్జెస్ట్‌మెంట్ తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మరీ ప్రధానంగా ఆయా డిపోల వారిగా ప్రయాణికులకు డిపోలో అందించే మౌలిక సదుపాయాలపై కూడా ఆరాతీసి తగినవిధంగా ఏర్పాటు చేస్తున్నారని తెలిసింది. అదేవిధంగా ఆయా బస్సుల్లోను ప్రయాణికులకు ఇబ్బందిలేకుండా ఆయా బస్సులకు చిన్నపాటి మరమ్మతులు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 320గ్రామాలకు బస్సులు సర్వీసులు ఉండగా ఉచిత ప్రయాణంతో జిల్లాలో మేజర్ పంచాయతీలు.. ప్రధాన రోడ్లపై సర్వీసుల్లో మరింత పెంచే విధంగా యోచిస్తున్నారు. ఆ దిశగా తగిన నివేదికను ఇదివరకే ఉన్నతాధికారులకు నివేదించారని తెలిసింది. ఏదిఏమైనా ఉచిత ప్రయాణం నేపథ్యంలోనైనా ఆయా డిపోల్లో ప్రయాణికులు మౌలిక సదుపాయాలు ఆశించిన స్థాయిలో కల్పిస్తారా? లేదా.. అనే సందేహాలు లేకపోలేదు.

మహిళలకు అండగా ప్రభుత్వం

బస్సుల్లో మహిళలకు కూటమి ప్రభుత్వం ఉచిత ప్రయాణం కల్పిస్తే పేద, మధ్యతరగతి మహిళలకు ఎంతో మంచిది. పేద మహిళలకు అండగా కూటమి ప్రభుత్వం ఉన్నట్లే. చదువుకునే అమ్మాయిలకు కూడా ఎంతో ఉపయోగకరం. ఉచిత ప్రయాణంతో చాలా మంది పేద ప్రయాణికులకు ఆర్థికంగా కలిసి వచ్చే అవకాశం ఉంది.

- సుభద్ర, రాయమల్పూరం

ఉచిత ప్రయాణానికి సిద్ధం



ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం జిల్లాలో మహిళలకు ఉచిత ప్రయాణానికి కావాల్సిన ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నాం. డిపోలకు సంబంధించిన సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఈవారంలో స్పష్టమైన ఆదేశాలు వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన మహిళలకు ఎంతో ఉపయోగకరం. ప్రభుత్వం నుంచి అనుమతి ఏ రోజు వచ్చినా తక్షణమే ఉచిత ప్రయాణం అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

- రజియా సుల్తానా, ఆర్టీసీ ఆర్ఎం, నంద్యాల

● జిల్లాలో రోజువారి ప్రయాణికులు ఇలా

డిపోలు	బస్సులు	ప్రయాణికులు (రోజు)
నంద్యాల	110	24,000
ఆత్మకూరు	72	22,000
ఆళ్లగడ్డ	74	20,000
బనగానపల్లె	65	18,000
డోన్	52	14,600
కోవెలకుంట్ల	52	19,000
నందికొట్కూరు	69	19,000

- జిల్లాలో బస్సుల సంఖ్య : 494
- జిల్లాలోని డిపోలు : 07
- ప్రతి రోజు ప్రయాణం : 1.65 లక్షల కిలోమీటర్లు
- ప్రయాణికులు : 1.20 లక్షలు
- ఇందులో మహిళలు : 40 వేల మంది
- ప్రతి రోజు ఆదాయం : రూ.65 లక్షలు
- ఇటీవల కొత్తగా వచ్చిన బస్సులు : 20
- అవసరమయ్యే డ్రైవర్లు, కండెక్టర్లు : 10+10

ఎక్కడి నుంచి ఎక్కడికైనా..

రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించేలా ప్రభుత్వం కసరత్తు పూర్తి చేసింది. నిజానికి మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని తొలుత జిల్లాలకే పరిమితం చేయాలని భావించిన ప్రభుత్వం.. తర్వాత మనసు మార్చుకుంది. జిల్లాలకు పరిమితం చేస్తే పెద్ద ప్రయోజనం ఉండదనే ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయాలని నిర్ణయించింది. కానీ తాజాగా తీసుకున్న నిర్ణయం ప్రకారం రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించేలా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఇప్పటికే రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు ప్రకటనలు కూడా చేశారు. అధికారికంగా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రావాల్సి ఉంది. అదేవిధంగా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతించనున్నారు.

రైతులకు శుభవార్త



- ఆగస్టు 2న మొదటి విడత 'అన్నదాత సుఖీభవ'
- రూ.7వేలు రైతుల ఖాతాల్లో జమ
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆరున్నర లక్షల మంది రైతులు
- 4.31లక్షల మందికి మాత్రమే లబ్ధి
- ఇంకా కొనసాగుతూనే ఉన్న కౌలురైతుల గుర్తింపు

అన్నదాతకు పెట్టుబడి కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. పంట సాగు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన పెట్టుబడి మొత్తాన్ని ఎప్పుడెప్పుడు జమచేస్తారోనని మే మాసం నుంచి ఎదురుచూస్తున్న రైతులకు కూటమి ప్రభుత్వం శుభవార్తను అందించింది. అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5వేలు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం ద్వారా రూ.2వేలు కలిపి మొత్తం రూ.7వేలను ఆగస్టు 2వ తేదీన రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేసిందని వ్యవసాయ శాఖ అధికార వర్గాలు తెలిపాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కౌలు రైతులతో కలిపి 6.50 లక్షల మంది రైతులు వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాతలందరినీ పీఎం కిసాన్‌తో పాటు కౌలురైతుల గుర్తింపునకు ఏ మాత్రం చర్యలు తీసుకోకపోవడంతో ప్రస్తుతం రెండు లక్షల మంది రైతులకు పెట్టుబడి సాయానికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని అర్హత పొందని రైతులు మొర పెట్టుకుంటున్నారు.



కర్నూలు అగ్రికల్చర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు కూటమి ప్రభుత్వం శుభవార్త అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అన్నదాత సుఖీభవ పథకానికి ఎట్టకేలకు మోక్షం లభించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగున్నర లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవతో పాటు పీఎం కిసాన్ సమ్మాన్ యోజన పథకం మొదటి విడత రూ.7వేలు అందించేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఈమొత్తానికి అర్హులైన రైతుల జాబితాలు ఇప్పటికే రెండు జిల్లాలో వ్యవసాయ యంత్రాంగం పూర్తిచేసింది. 'అన్నదాత సుఖీభవ' కింద కూటమి ప్రభుత్వం కేంద్రం ఇచ్చే డబ్బులను కలిపి ఏడాదికి రూ.20వేలను మూడు విడతల్లో అందిస్తారని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఇందులో కేంద్రం వాటా రూ.6వేలు కాగా రాష్ట్రం వాటా రూ.14వేలు ఉంది. పీఎం కిసాన్ సమ్మాన్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.6వేలను మూడు విడతలుగా ఒక్కో విడతలో రూ.2వేల చొప్పున రైతుల ఖాతాకు

మిగతా 6లో

'అన్నదాత సుఖీభవ'కు 2.07లక్షల రైతులు అర్హులు

- యూరియాపై ఆందోళన చెందొద్దు
- కలెక్టర్ రాజకుమారి



నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అన్నదాత సుఖీభవ పథకానికి 2.07లక్షల మంది రైతులు అర్హులు అని కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా అన్నదాత సుఖీభవ, యూరియా లభ్యతపై తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా రెవెన్యూ, వ్యవసాయ అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ 2.07లక్షల మంది రైతుల్లో 1.97 లక్షల మందికి ఈకేవైసీ, ఎన్‌సీపీఐ ఖాతాలు మ్యాపింగ్ చేశారన్నారు. జి ల్లాలో 2463 రైతులకు ఈకేవైసీ పెండింగ్‌లో ఉందని, ఆరువేల మంది ఎన్‌సీపీఐ ఇన్‌యాక్టివ్, నాట్ మ్యాపింగ్ రైతులు న్నారని గుర్తు చేశారు. వారందరూ అ ర్హత సాధించేలా చూడాలని రెవెన్యూ, వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్క రైతు ఖాతాలో నగదు జమ అయ్యేలా అనునిత్యం పర్యవేక్షించాలన్నారు. కొలిమిగుండ్ల, మిడుతూరు, ప్యాపిలి, డోన్, ఆళ్లగడ్డ, ఉయ్యాలవాడ, అవుకు, గోస్పాడు, చాగలమర్రి, పాణ్యం, బనగానపల్లె, రుద్రవరం, శిరువెళ్ల, సంజామల మండలాల్లో ఎక్కువశాతం పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటన్నింటిని పర్యవేక్షించి యాక్టివేట్ అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్‌కు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రస్తుతం 700 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, అదనంగా 1300 మెట్రిక్ టన్నుల యూరియా కూడా జిల్లాకు వస్తోందన్నారు. ఒక సంచి యూరియా అరబాటిల్ నానో యూరియాకు సమానమన్న విషయాన్ని రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు.

జర్మన్ భాషపై ఉచిత శిక్షణ

నంద్యాల రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ వర్గానికి చెందిన నర్సులకు విదేశీ ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జర్మన్ భాషపై ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చింతామణి తెలిపారు. బీఎస్సీ, జీఎన్ఎం పూర్తి చేసి రెండు, మూడు సంవత్సరాలు క్లినికల్‌లో అనుభవం ఉన్న వారు అర్హులని తెలిపారు. 8 నుంచి 10 నెలల పాటు ఉచిత భోజన వసతితో విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫొటో, నర్సింగ్ విద్యార్హత, క్లినికల్ అనుభవం సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు నంద్యాలలోని పొన్నాపురం కాలనీలోని జిల్లా ఎస్సీ సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రైల్వే సమస్యలను పరిష్కరించాలి

- రైల్వే కేంద్ర మంత్రికి ఎంపీ వినతి



రైల్వే కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైల్వే సమస్యలను పరిష్కరించాలని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి కోరారు. ఢిల్లీలోని పార్లమెంట్ ఆవరణలో బుధవారం రైల్వే కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఎంపీ మాట్లాడుతూ నంద్యాల పార్లమెంట్‌లోని పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న రైల్వే ప్రధాన సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. రైల్వే ప్రయాణికుల సౌకర్యం, మెరుగైన కనెక్టివిటీ, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి వంటి అంశాల గురించి రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. తగిన పరిష్కారాలను త్వరితగతిన తీసుకుంటామని హామీ ఇచ్చారన,ఇ రైల్వే మౌలిక వసతుల కల్పించడానికి కృషి చేస్తామని కేంద్ర మంత్రి చెప్పినట్లు ఎంపీ తెలిపారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రులు బీసీ, ఆనం, రామ్‌కో ఎండీ



స్వామి వారికి నూతన వస్త్రాలు తెస్తున్న మంత్రి బీసీ దంపతులు

ఆలయాల అభివృద్ధికి కృషి

- ప్రభుత్వంపై నరసింహస్వామి అనుగ్రహం
- దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

కొలిమిగుండ్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి వెల్లడించారు. నవనారసింహ క్షేత్రాలు కొలువై ఉన్న ఏపీ దివ్యధామంగా ఆయన అభివర్ణించారు. బుధవారం కొలిమిగుండ్ల మండలంలోని కొండపై వెలసిన పురాతన లక్ష్మీనరసింహ ఆలయ మహా సంప్రోక్షణ, కుంభాభిషేక వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు మంత్రి ఆనంతో పాటు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ పాల్గొన్నారు. ముందుగా తిరుమల తిరుపతి దేవస్థానం దేవస్థాన పండితులు మంత్రులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రూ.7.5 కోట్లతో ఆలయాన్ని పునరుద్ధరించిన పనుల శిలాఫలకాన్ని రామ్‌కో ఎండీ వెంకటరామరాజుతో కలిసి మంత్రులు ఆవిష్కరించారు. అనంతరం ఆలయ రాజగోపురంపై మహా కుంభాభిషేకంలో పాల్గొన్నారు. టీటీడీ ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితుల ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రులకు వేద మంత్రోచ్చారణలో ఆశీర్వాదం అందజేశారు. అనంతరం మంత్రులు మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబుతో పాటు రాష్ట్రంపై లక్ష్మీనరసింహస్వామి అనుగ్రహం ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. 500 సంవత్సరాల క్రితం స్వయంగా శ్రీకృష్ణ దేవరాయులు నిర్మించిన ఆలయ పునః ప్రతిష్ఠ, పూజల్లో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ వేడుకలో మైనింగ్ శాఖ రిటైర్డ్ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, టీడీపీ నాయకులు మూలే రామేశ్వరరెడ్డి, వీఆర్ లక్ష్మీరెడ్డి, నంద్యాల రామేశ్వరరెడ్డి, హుస్సేన్‌రెడ్డి, ఇటిక్యాల బాలిరెడ్డి, రవిప్రకాష్‌రెడ్డి, ప్రసాదు, నరసింహుడు తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో నంద్యాల కలెక్టర్

- ఘనస్వాగతం పలికిన శ్రీమఠం అధికారులు
- జ్ఞాపిక, శేషవస్త్రం, ప్రసాదం అందజేత



శ్రీమఠంలో ప్రదక్షిణలు చేస్తున్న కలెక్టర్ రాజకుమారి

మంత్రాలయం, జూలై 30(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి కుటుంబ సమేతంగా బుధవారం సాయంత్రం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. వీరికి మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేషపూజలు చేశారు. పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట ఏఏవో మాధవశెట్టి, తహసీల్దార్ రమాదేవి, ఆర్ఐ జనార్దన్ రావు, అనంతపురాణిక్, అనంతస్వామి, ప్రకాశ్ఆచార్, పవన్ ఆచార్, వ్యాసరాజాచార్, జయతీర్థ ఆచార్, స్వామిరాయ్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

అహోబిలం ఆలయాభివృద్ధికి కృషి చేస్తా

- రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ అంజనీ కుమార్
- లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



ఆలయంలో ప్రదిక్షణలు చేస్తున్న జైళ్ల శాఖ డీజీపీ అంజనీ కుమార్

ఆళ్ళగడ్డ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసిం హస్వామి ఆలయ అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానని రాష్ట్ర జైళ్ల శాఖ డీజీపీ అంజనీకుమార్ అన్నారు. బుధవారం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబీ వేణుగోపాల్‌స్వామి ఆధ్వర్యంలో పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో లక్ష్మీనరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ విశిష్టతను ప్రధాన అర్చకులు వేణుగోపాల్‌స్వామి డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా అంజనీకుమార్ మాట్లాడుతూ స్వామివారిని దర్శించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్ఐ వరప్రసాద్, ఏపీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శెట్టి విజయకుమార్, టీడీపీ అధ్యక్షుడు గూడురు సంజీవరాయుడు, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీ చేయండి

- కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఒకే అర్జీ మూడుసార్లు పునరావృతమైతే సంబంధిత తహసీల్దార్లకు షోకాజ్ నోటీసులు జారీచేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా డీఆర్వోను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని క్యాంపు కార్యాలయం నుంచి పీ-4 పాలసీ, తల్లికి వందనం, హౌసింగ్, ఉపాధి హామీ, తాగునీరు పీజీఆర్ఎస్, యూరియా లభ్యత తదితర అంశాలపై అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా పంపిణీలో సమస్యలు లేకుండా చూడాలని సబ్ కలెక్టర్, ఆర్డీవోలు, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. 507 ఫిర్యాదులు తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ల వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, డీఎస్‌వో శ్యామల తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి ఆది కర్మ యోగి అభియాన్ పథకం

కర్నూలు కలెక్టరేట్, జూలై 30(ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభివృద్ధికి ఆది కర్మ యోగి అభియాన్ పథకాన్ని అమలు చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో ఆది కర్మ యోగి అభియాన్ పథకం అమలుపై వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవోలతో సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గిరిజనులు, సంచార జాతుల వారి అభ్యున్నతికోసం ఆది కర్మయోగి అభియాన్ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. జిల్లాలో 35వేల మంది గిరిజనులు ఉన్నారని, వీరికి అన్ని పథకాలు, సేవలు సంతృప్తి స్థాయిలో అందేలా చర్యలు తీసుకోవా లన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, డిటీడబ్ల్యూవో కొండయ్య పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు గడువు పెంపు

- నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ పద్మావతి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు గడువును పొడగించినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. దరఖాస్తు చేసుకునే విద్యా ర్థులు ఉమ్మడి కర్నూలు జిల్లావాసులై ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు తేదీని 13ఆగస్టు 2025వ తేదీ వరకు పొడగించామ న్నారు. అభ్యర్థులు అప్లికేషన్‌ను పూర్తిచేసే సమయంలో పోర్టల్‌లో కుల ధృవీకరణ పత్రాన్ని అప్‌లోడ్ చేయడం తప్పనిసరి కాదన్నారు. అభ్యర్థులు 3, 4వ తరగతులను ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. 5వ తరగతి విద్యార్థులు ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో చదువుతూ ఉండాలన్నారు. డిసెంబర్ 13వ తేదీన ఎంపిక రాతపరీక్ష ఉంటుందన్నారు.

హత్య కేసులో ఇద్దరికి జైలు శిక్ష

- ఒకరికి యావజ్జీవం, మరొకరికి ఏడేళ్లు

మహానంది, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపవరం సమీపంలోని మానసిక వికలాంగుల పాఠశాల సమీపంలో 2015 సంవత్సరంలో న్యాయవాది కె. బసవరాజును హత్య చేసి మృతదేహాన్ని దహనం చేసిన ఘోర ఘటనపై నంద్యాల మూడో అదనపు జిల్లా కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. విచారణలో నేరం రుజువు అవ్వడంతో రెండో నిందితుడు బలిజ సాయన్న గారి నాగరాజుకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా, మూడో నిందితుడు నాగేంద్రకు 7 సంవత్సరాలు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు. మొదటి నిందితురాలు సుజాత ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండటంతో తీర్పు వాయిదా వేశారు. నాలుగో నిందితుడు ఇల్లూరి వెంకటరెడ్డి విచారణకు ముందే మృతిచెందాడు. వివాహేతర సంబంధం, అశ్లీల వీడియోల ఆధారంగా జరిగే బెదిరింపుల నేపథ్యంలో కుట్ర పూర్వకంగా హత్య జరిగినట్లు కోర్టు నిర్ధారించింది. ఈకేసు దర్యాప్తులో కీలకపాత్ర పోషించిన మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి, అదనపు ప్రభుత్వ అభియోక్తలు తిరుపతి, వైవీ గోపాలకృష్ణరెడ్డి, రాజేశ్వరరెడి, కోర్టు హెడ్ కానిస్టేబుల్ విద్యాసాగర్‌ను జిల్లా పోలీస్ అధికారి అధిరాజ్‌సింగ్ రాణా, ఏఎస్పీ మందా జావళి ఆల్ఫోన్స్, సీఐ శ్రీనివాసులరెడ్డి అభినందించారు.

రైతులకు శుభవార్త



(5పేజీ తరువాయి)

జమ చేస్తుంది. అన్నదాత సుఖీభవ నిధులను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనుంది. తొలి విడతలో రూ.7వేలు, రెండో విడతలో రూ.7వేలు, మూడో విడతలో రూ.6వేలు మొత్తం రూ.20వేలు ఒక ఏడాదికి రైతుల బ్యాంకు ఖాతాలకు జమ కానున్నాయి.

కౌలు రైతులతో కలిపి..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో కౌలురైతులతో కలిపి 6.50లక్షల మంది రైతులున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో అన్నదాతలందరినీ పీఎం కిసాన్‌తో పాటు కౌలురైతుల గుర్తింపునకు ఏ మాత్రం చర్యలు తీసుకోకపోవడంతో ప్రస్తుతం 2లక్షల మంది రైతులు పెట్టుబడి సాయానికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది. కూటమి ప్రభుత్వమైనా తమకు న్యాయం చేయాలని అర్హత పొందని రైతులు మొర పెట్టుకుంటున్నారు. కర్నూలు జిల్లాలో 2,50,634 మంది రైతులు మాత్రమే ఇప్పటి దాకా ఇకేవైసీ, ఈక్రాఫ్ బుకింగ్ పూర్తిచేసుకుని మొదటి విడత ఆర్థికసాయానికి అర్హత సాధించారు. వివిద కారణాలతో 7,601 మంది లబ్ధి పొందలేని పరిస్థితి నెలకొంది. నంద్యాల జిల్లాలో 1,80,787 మంది మాత్రమే ప్రభుత్వ సాయానికి అర్హత సాధించారు. ఇంకా 4,510 మందికి ఆర్థిక సాయం అందించలేని పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం రెండు జిల్లాలో 12,111 మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పెట్టుబడి సాయానికి దూరమవుతున్నారు. వీరందరినీ అర్హత జాబితాలో చేర్చేందుకు గ్రామాల్లో రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది కసరత్తు చేస్తున్నారు. ఆగస్టు 2వ తేదీకి ఈకసరత్తు పూర్తయితేనే వీరందరికీ అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందుతుంది.

కౌలురైతుల గుర్తింపు ప్రక్రియ..

కౌలు రైతులకు 'అన్నదాత సుఖీభవ' వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంది. గ్రామాల్లో కౌలు రైతులను గుర్తించే ప్రక్రియ నత్తను తలపిస్తోంది. కర్నూలు జిల్లాలో 25వేల మంది కౌలు రైతులను గుర్తించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికీ 2,695 మంది రైతులకే గుర్తింపు కార్డులు ఇచ్చారు. నంద్యాల జిల్లాలో 30వేల మంది కౌలు రైతులకు గానూ కేవలం 4,030 మంది కౌలు రైతులకు మాత్రమే గుర్తింపు కార్డులు ఇచ్చారు. రెండు జిల్లాలో 55వేల మందికి పైగా కౌలు రైతులు ఉన్నా కూడా కేవలం 7వేల మందికి మాత్రమే గుర్తింపు కార్డులు ఇచ్చారు.

అర్హత ఉన్నరైతులందరికీ..

అర్హత ఉన్న రైతులందరికీ 'అన్నదాత సుఖీభవ' మొదటి విడత రూ.7వేలను ఆగస్టు 2న రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకున్నాం. కర్నూలు జిల్లాలో ఈకేవైసీ తదితర కారణాల వల్ల అర్హత కోల్పోయిన రైతులందరికీ ఆటంకాలను తొలగించి వారిని కూడా లబ్ధిదారులుగా చేర్పించే కార్యక్రమం చేపట్టాం.

- వరలక్ష్మి, జేడీ, కర్నూలు



మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



హాజరైన వివిధ బ్యాంకు మేనేజర్లు

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలి

- ప్రతి బ్యాంకు వద్ద సెక్యూరిటీ గార్డులు ఉండాలి
- సైబర్ నేరాలపై ఖాతాదారులను అప్రమత్తం చేయాలి
- ఎస్పీ విక్రాంత్ పాటిల్ ● బ్యాంకర్లతో సమావేశం

కర్నూలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి బ్యాంకు వద్ద కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో బ్యాంకు భద్రతా ప్రమాణాలపై జిల్లాలోని వివిధ బ్యాంకుల మేనేజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, హర్యానా రాష్ట్రాల్లో హైవే పక్కన ఉన్న బ్యాంకులో జరిగిన దొంగతనాల గురించి గుర్తుచేశారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో జరగకుండా బ్యాంకు అధికారులు భద్రతలను పకడ్బందీగా ఏర్పాటుచేసుకో వాలన్నారు. బ్యాంకు బయట, లోపల అన్ని ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయా లన్నారు. బ్యాంకుల్లో సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలన్నారు. లారీ డ్రైవర్స్ లారీల్లో కార్లను డెలివరీ చేసేందుకు వచ్చి రెక్కీ నిర్వహించి దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. ఖాతాదారుల ఖాతాల్లో పెద్దమొత్తాల్లో లావాదేవీలు జరిగినప్పుడు బ్యాంకు అధికారులు అప్రమత్తంగా ఉంటూ సైబర్ మోసగాళ్ల గురించి ఖాతాదారులను అప్రమత్తం చేయాలన్నారు. ఓటీపీ ఫ్రాడ్స్, ఏపీకే ఫైల్స్, డిజిటల్ ఫ్రాడ్స్, గురించి బ్యాంకుల్లో హెచ్చరిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జె.బాబు ప్రసాద్, బ్యాంకు మేనేజర్లు అబ్దుల్ రావూఫ్, వీరయ్య, స్పెషల్ బ్రాంచ్ సీఐ తేజమూర్తి, పట్టణ సీఐలు రామయ్యనాయుడు, నాగరాజరావు, శ్రీధర్, విక్రమసింహ, చంద్రబాబు నాయుడు, మన్సూరుద్దీన్, నాగశేఖర్, సైబర్ ల్యాబ్ సీఐ వేణుగోపాల్, ఎస్ఐలు, సైబర్ ల్యాబ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ-నామ్ బలోపేతానికి కసరత్తు

- ఢిల్లీ నుంచి అధికారుల బృందం రాక
- రాష్ట్రంలో కర్నూలు, ఆదోని మార్కెట్ కమిటీల ఎంపిక



మార్కెట్ యార్డులో రైతులు తెచ్చిన పంట ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం

కర్నూలు అగ్రికల్చర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర అందించడంతో పాటు మార్కెటింగ్ శాఖకు లక్ష్యం మేరకు సెస్సు రూపంలో ఆదాయాన్ని సాధించేందు కోసం కేంద్రం ఈ-నామ్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. ఈ విధానం మరింతగా రైతులకు ప్రయోజనం కల్పించేలా అవసరమైన మార్పులు, చేర్పులు చేసి కొత్త డిజిటల్ విధానాన్ని అమలులోకి తెచ్చేందు కోసం కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఒక్కో రాష్ట్రంలో రెండు మార్కెట్ కమిటీల్లో కేంద్రం, రాష్ట్ర ఉన్నతాధికారుల చేత పరిశీలించేందుకు కసరత్తు మొదలు పెట్టింది. ఏపీలో కర్నూలు, ఆదోని మార్కెట్ కమిటీలను మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయసునీత ఎంపిక చేసి ఢిల్లీ నుంచి ఉన్నతాధికారుల కమిటీకి పంపించారు. ఢిల్లీలో ఎస్ఎఫ్ఏసీ సంస్థ బిజినెస్ కన్సల్టెంట్ అధికారి అనిల్‌కుమార్ టీం లీడర్‌గా, మరో నలుగురు ఉన్నతాధికారులు బుధవారం కర్నూలు మార్కెట్ యార్డులో పర్యటించారు. వీరు రైతులతో పాటు కమిషన్ ఏజెంట్లు వ్యాపారులతో మాట్లాడారు. ఇప్పటిదాకా ఈ-నామ్‌లో అందుతున్న ప్రయోజనాలతో పాటు మరిన్ని విధానాల రూపకల్పనకు తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. గురువారం ఆదోని మార్కెట్ యార్డులో పర్యటించి మార్కెట్ కమిటీ అధికారులతో పాటు రైతులు, కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులతో మాట్లాడుతామని కేంద్రం బృందం సభ్యులు తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన బృందంలో ఉన్నతాధికారులు రవీంద్ర చౌహాన్, దీపక్‌వర్మ, దిలీప్ కుమార్, అశోక్ కుమార్ ఉన్నారు. వీరి వెంట కర్నూలు మార్కెట్ కమిటి అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, శివన్న, నాగేష్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల

- శ్రీశైలం డ్యాం 8 గేట్ల ద్వారా సాగర్‌కు వరద



శ్రీశైలం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.80 అడుగులకు చేరుకుంది.

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నీలం సంజీవరెడ్డి శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. ప్రస్తుతం 8 గేట్ల ద్వారా నాగార్జునసాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో 2,89,670 క్యూసెక్కుల మేర వరద చేరుతోంది. అవుట్‌ఫ్లో 3,02,478 క్యూసెక్కులుగా ఉంది. 8 స్పిల్‌వే గేట్ల ద్వారా 2,16,520 క్యూసెక్కులు, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 20వేల క్యూసెక్కులు, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 33,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా 30,643 క్యూసెక్కులు నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

మానవ అక్రమ రవాణాను అరికట్టాలి

- జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ జుబేదాబేగం



మాట్లాడుతున్న జుబేదాబేగం

కర్నూలు రూరల్ జూలై 30(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాను అరికట్టేందుకు ఐక్యంగా పనిచేయాలని జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్మన్ జుబేదాబేగం పేర్కొన్నారు. మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కర్నూలు సిటీ రైల్వేస్టేషన్‌లో కోనేరు సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జుబేదాబేగం హాజరై మాట్లాడారు. హ్యూమన్ ట్రాఫికింగ్ అనేది ఒక సంఘటిత నేరంగా వర్ణించారు. స్టేషన్ మాస్టర్ శేషఫణి, ఆర్పీఎఫ్ సీఐ రామ్‌మోహన్ సంయుక్తంగా మాట్లాడుతూ బహిరంగా ప్రదేశాల్లో ట్రాఫికింగ్ ఎక్కువగా జరుగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఇన్‌స్పెక్టర్ రామాంజనేయులు, మౌనిక, మధుసుధాకర్, మున్నాజీరావు పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో...

కర్నూలు లీగల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణా నిరోధించడానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా నిరోధక కార్యక్రమాన్ని న్యాయసేవాసదన్ భవనంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం, నిరక్షరాస్యత, ధనాశతో పలువురు మానవ అక్రమ నివారణకు పాల్పడుతుంటారన్నారు. అలాంటి వారికి కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ అక్రమ రవాణా రోజురోజుకు పెరిగిపోతుండటంతో ఐక్యరాజ్య సమితి ప్రతి ఏడాది జూలై 30న మానవ అక్రమ రవాణా నిరోధక దినోత్సవాన్ని నిర్వహించడానికి నిర్ణయించిందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మహిళా శిశు సంరక్షణ అధికారిణి నిర్మల, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ విజయలక్ష్మి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరామచంద్రరావు, సులోచన, న్యాయవాది ఆశాబాయి పారా లీగల్ వాలంటీర్లు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో ఆగస్టు 1న జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు అండర్-14, 16, 18, 20 విభాగాల్లో బాల బాలికలకు అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తు న్నట్లు కార్యదర్శి సుబ్బరత్నాలు తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 9, 10, 11 తేదీల్లో గుంటూరు జిల్లా బాపట్లలో జరిగే రాష్ట్ర స్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాల కోసం 8919409232, 949332 3964 నంబర్లను సంప్రదించాలన్నారు.

మాన్యం భూముల అన్యాక్రాంతం కానివ్వం

- దేవదాయ శాఖ మంత్రి ఆనం



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రులు ఆనం, బీసీ

బనగానపల్లె, జూలై 30(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు సంబంధించిన మాన్యం భూములను అన్యాక్రాంతం కానివ్వమని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం బనగానపల్లె పట్టణంలో మంత్రి ఆనంతో పాటు రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి విలేకరులతో మాట్లాడారు. నంద్యాల జిల్లాలోని యాగంటి, నందవరం, కొత్తూరు సుబ్రమణ్యేశ్వర తదితర దేవాలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. త్వరలో యాగంటి క్షేత్రాన్ని సందర్శిస్తానన్నారు. నియోజకవర్గంలోని కంబగిరిస్వామి ఆలయం మాన్యం, ఇతర ఆలయ భూముల మాన్యం భూములు అన్యాక్రాంతమైనట్లు మంత్రి దృష్టికి విలేకరులు తీసుకెళ్లారు. ఒక్కసెంటు భూమి కూడా అన్యాక్రాంతం కానీయమన్నారు. యాగంటి క్షేత్రంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. బనగానపల్లె నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి 9 పనులకు రూ.5.94 కోట్ల నిధులు కేటాయించామన్నారు. రెండు పనులు పూర్తికాగా ఏడు పనులు జరుగుతున్నట్లు తెలిపారు.

సప్తరాత్రోత్సవాలకు

మంత్రాలయం ముస్తాబు



- ఆగస్టు 8 నుంచి 14వ తేదీ వరకు నిర్వహణ
- భారీ క్యూలైన్లు, విద్యుత్ దీపాలతో అలంకరణ
- ముమ్మరంగా సాగుతున్న పనులు
- పార్కింగ్, వసతి ఏర్పాట్లు



మహాముఖద్వారానికి రంగులు వేస్తున్న కళాకారులు

మంత్రాలయం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి 354వ సప్తరాత్రోత్సవాలకు సర్వం సిద్ధంచేశారు. వచ్చేనెల 8 నుంచి 14వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లుచేశారు. రంగులు, విద్యుద్దీపాలతో అలంకరణ, భారీ క్యూలైన్లు, రెండు కంపార్టుమెంట్లు, వంటి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పార్కింగ్, వసతి, మురికి కాలువల మరమ్మ తులు, వైద్యం, పరిమళ ప్రసాదం కౌంటర్లు ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే మధ్వమార్గ్ కారిడార్‌లో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు, ముఖద్వారం పైఅంతస్తులో రెండు కంపార్టుమెంట్లు భక్తులకు ఈఏడాది ప్రత్యేకంగా ఏర్పాట్లు చేపడుతున్నారు. భక్తులకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు శ్రీమఠంలోని అన్నిశాఖల అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, తుంగభద్ర కారిడార్, సంస్కృత పాఠశాల కారిడార్ వద్ద రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరణ పనులు చేపడుతున్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి మృతి

దొర్నిపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భాగ్యనగరానికి చెందిన రామాంజనేయులు(40) అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందినట్లు ఏఎస్ఐ రంగయ్య తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజనేయులు బుధవారం తెల్లవారుజామున ఇంట్లోనే మృతిచెందాడు. కుటుంబీకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఏఎస్ఐ ఘటనాస్థలికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తమ్ముడు నాగాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఇనుప రాడ్లతో దాడి

ఉయ్యాలవాడ, జూలై 30(ఆంధ్రజ్యోతి): ఇనుపరాడ్లతో ఓ వ్యక్తిపై దాడి చేసిన కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామానికి చెందిన భరత్, విష్ణు, చాంద్‌బాషా పాతగొడవలు నేపథ్యంలో చాకలి చిన్న అంకాలుపై బుధవారం ఇనుప రాడ్లతో దాడిచేశారు. ఈదాడిలో అంకాలుకు గాయాలు కాగా హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

కోవెలకుంట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఉరేసుకొని ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పట్టణంలోని నాగులకట్ట సమీపంలో చోటు చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. వివరాలు.. ఆళ్లగడ్డ మండలం బాచుపల్లెతండాకు చెందిన మూడె పవన్‌నాయక్(27) అనే వ్యక్తి కోవెలకుంట్లలోని ఓ ప్రైవేటు కంపెనీలో క్యాషియర్‌గా పనిచేస్తుండేవాడు. ఏడాది క్రితం పవన్‌నాయక్‌కు పెళ్లి అయ్యింది. వారం రోజుల క్రితం కూతురు పుట్టింది. అతడి భార్య పుట్టింటికి వెళ్లింది. అక్కడ ఏం జరిగిందో ఏమో మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పవన్‌నాయక్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సమస్యలే కారణమని మృతుడి అన్న బాలస్వామి నాయక్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై దాడి .. కేసు నమోదు

బనగానపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీరవోలు గ్రామానికి చెందిన చిన్నరంగయ్య అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన బెలుం బాలచంద్రుడుపై దాడి చేశాడు. ఈ మేరకు బుధవారం చిన్నరంగయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు. చెత్త తీసుకువెళ్లే బండిని బాలచంద్రుడు తీసుకు వెళ్తుండగా చెత్త బండి రోడ్డుకు అడ్డుగా పెట్టాడన్న నెపంతో రంగయ్య దాడి చేయగా బాధితుడి ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేశామన్నారు.

కల్వటాలలో అట్రాసిటీ కేసు : సీఐ

కొలిమిగుండ్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వటాల గ్రామానికి చెందిన ప్రసాదరెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. వివరాలు.. గ్రామంలో బుధ వారం ప్రసాదరెడ్డి, యాడికి ప్రతాప్ అనే వ్యక్తులు టెంకాయలు పగులగొట్టే విషయంలో ఘర్షణ పడ్డారు. ప్రతాప్‌ను ప్రసాదరెడ్డి కులం పేరుతో దూషించి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న బస్సు.. దంపతులకు గాయాలు

ఆదోని రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండవగల్లు సమీపంలో ఆర్టీసీ బస్సు బైకును వెనకనుంచి ఢీకొట్టడంతో దంపతులకు గాయాలయ్యాయి. వివరాల మేరకు.. అనంతపురం జిల్లా బొమ్మనహాళ్ మండలం కురహళ్ళి గ్రామానికి చెందిన దంపతులు లక్ష్మీ, శ్రీనివాస్‌రెడ్డి బైకులో మాధవరం మండలం సింగరాజనహళ్ళి గ్రామానికి బయలుదేరారు. కాగా పాండవగల్లు వద్ద బస్సు వీరి బైకును ఢీకొట్టడతో దంపతులు కిందపడి గాయపడ్డారు. వీరిని ఆదోని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దతుంబళం ఎస్ఐ మహేష్ కుమార్ తెలిపారు.

672 కర్ణాటక మద్యం బాటిళ్లు స్వాధీనం

- వెయ్యి లీటర్ల బెల్లం ఊట, 75 లీటర్ల సారా పట్టివేత


సూపరింటెండెంట్ రవికుమార్

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మద్యంను రవాణా చేస్తున్న డోన్ కొత్తపేటకు చెందిన సంగం నరేష్‌ను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.1.80 లక్షల విలువ చేసే 672 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సూపరిం టెండెంట్ రవికుమార్ తెలిపారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా నవోదయ కార్యక్రమంలో భాగంగా తనిఖీలు చేపట్టారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఐదు సారా కేసుల్లో ఆరుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి 75 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. వివిధ పాత కేసుల్లో తప్పించుకుని తిరుగుతున్న 23 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని, జూలై 30(ఆంధ్రజ్యోతి): కౌతాళం మండలం కుంబళనూరు గ్రామం వద్ద కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నటు ఎక్సైజ్ పోలీసులు బుధవారం తెలిపారు. వివరాల మేరకు.. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈఎస్టీఎఫ్ కర్నూలు, ఆదోని ఎక్సైజ్ సిబ్బంది కలిసి మంగళవారం తెల్లవారుజామున దాడులు చేశారు. నిందితులు వెంకోబ, సిద్ధప్ప, నాగేంద్ర రెండు మోటార్ సైకిళ్లపై 20 బాక్సుల మద్యాన్ని తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నారు. సిబ్బందిని ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు అభినందించారు.

అస్వస్థతకు గురై వ్యక్తి మృతి

- ఆర్‌ఎంపీ వైద్యమే కారణమని బంధువుల ఆందోళన


రంగస్వామి (ఫైల్)

పత్తికొండ, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనగర్ కు చెందిన రంగస్వామి (40)అనే వ్యక్తి బుధవారం అస్వస్థతకు గురై మృతిచెందాడు. కాగా ఆర్‌ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్ వల్లే తన భర్త మృతిచెందాడని మృతుడి భార్య, బంధువులు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. బాధితుల కథనం మేరకు.. పత్తికొండ పట్టణానికి చెందిన రంగస్వామి పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. బుధవారం ఉదయం అస్వస్థతకు గురికావడంతో ఆర్‌ఎంపీ వద్దకు వెళ్లాడు. ఆర్‌ఎంపీ సూచన మేరకు అసిస్టెంట్ రంగస్వామికి ఇంజక్షన్ వేశాడు. అనంతరం ఇంటికి వెళ్లగానే రంగస్వామి మరింత అస్వస్థతకు గురై కొద్దిసేపటికే మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆర్‌ఎంపీపై కేసు నమోదు చేయాలని పత్తికొండ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేశారు. కాగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇస్తే విచారణ చేసి కేసు నమోదు చేస్తామని సీఐ జయన్న తెలిపారు.

లారీ దగ్ధం


దగ్ధమైన లారీ

ఆస్పరి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పత్తికొండ మండలం నలకదొడ్డి గ్రామ బస్టాండు సమీపంలో మంటలు చెలరేగి లారీ దగ్ధమైంది. వివరాల మేరకు.. ఏపీ 39టీబీ 1159 నంబర్ గల వైజాగ్ నుంచి బళ్లారికి హైడ్రోమాక్స్ పౌడర్ లోడుతో వెళ్తున్న లారీ ఇంజన్‌లో వేడి కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే లారీ దిగి పక్కకు వెళ్లాడు. జిందాల్ ఫ్యాక్టరీలో ఇనుము తయారీకి పౌడర్‌ను వాడతారని, పౌడర్ విలువ రూ.47,27,900 కాగా, లారీ విలువ రూ.40 లక్షలని డ్రైవర్ షేక్ మహబూబ్ బాషా తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మస్తాన్‌వలి తెలిపారు.

విద్యుత్ పోరాటానికి సిద్ధం

- పేదల ఇళ్ల స్థలాల కోసం ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- హామీల అమలులో చిత్తశుద్ధి చూపాలి
- ఆగస్టు 5న విద్యుత్ కార్యాలయాలను ముట్టడిస్తాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- ఆకట్టుకున్న ప్రజా నాట్యమండలి నృత్యాలు
- ఎరుపెక్కిన డోన్ పట్టణం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


ప్రజా నాట్యమండలి కళాకారుల నృత్య ప్రదర్శన

డోన్ రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధమవుతుందని, దీనికి వ్యతిరేకంగా విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో సీపీఐ నంద్యాల జిల్లా రెండో మహాసభ సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై కార్యకర్తలను, ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో భాగంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న హామీ అమలు కోసం పోరాటాల ద్వారా కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తామని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధిని కనబరచాలన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇంటి నిర్మాణాల కోసం కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే నిధులు మంజూరుచేసి పేదలను ఆదుకుంటామని ఇచ్చిన హామీని విస్మరిస్తుందన్నారు. వచ్చే నెల 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల ముట్టడికి సిద్ధం కావాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఒంగోలులో వచ్చే నెల 22, 23 తేదీల్లో జరిగే సీపీఐ రాష్ట్ర మహాసభలకు కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పల నాగేశ్వరరావు, రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు రామచంద్రయ్య, రాష్ట్రకార్యవర్గ సభ్యులు జగదీష్, రామాంజనేయులు, నక్కి లెనిన్‌బాబు, జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫకృద్దీన్, రాధాకృష్ణ, సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.

భారీ ప్రదర్శన

జిల్లా రెండో మహాసభల సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహం ప్రధాన రోడ్డు నుంచి బస్టాండ్ వరకు సీపీఐ ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు భారీ ప్రదర్శనను నిర్వహిం చారు. పాతబస్టాండు రైల్వేస్టేషన్ రోడ్డులో ఏర్పాటు చేసిన బహిరంగసభలో ప్రజా నాట్యమండలి కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. నంద్యాల జిల్లాలోని 29మండలాల నుంచి భారీ ఎత్తున సీపీఐ కార్యకర్తలు అభిమానులు తరలి రావడంతో డోన్ ఎర్రజెండాలతో ఎరుపెక్కింది.

కర్నూలు-హోస్పేట్ వయా ఎమ్మిగనూరు

- నూతన రైలు మార్గం కోసం రైల్వే మంత్రికి సీఎం లేఖ


రైల్వే మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు లేఖ ఇస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

కర్నూలు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కర్నూలు - హోస్పెట్ వయా ఎమ్మిగనూరు, ఆదోని, తోర్నకల్లు మీదుగా నూతన రైలు మార్గం నిర్మాణం కోసం సీఎం చంద్రబాబు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్‌వైష్ణవ్‌కు లేఖ రాశారు. ఆ లేఖను బుధవారం కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్‌వైష్ణవ్‌కు అందజేశారు. అదే క్రమంలో ఈ రైలు మార్గం నిర్మాణం చేస్తే కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం పారిశ్రామిక, రవాణా రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, సర్వే, డీపీఆర్ తయారు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే బీవీ కూడా మరో లేఖను అందజేశారు. ఇప్పటికే మంత్రాలయం - కర్నూలు వయా ఎమ్మిగనూరు, కోడుమూరు మధ్య 110 కిలో మీటర్ల రైలు మార్గం నిర్మాణం రీసర్వే కోసం రూ.28 లక్షలు కేటాయించారు. తాజాగా కర్నూలు - హోస్పెట్ వయా ఎమ్మిగనూరు, ఆదోని మధ్య మరో నూతన రైలుమార్గం నిర్మాణానికి సీఎం చంద్రబాబు ప్రతిపాదన చేయడంతో ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు నియోజకవర్గాల్లో ప్రగతి పరుగులు పెట్టే అవకాశం ఉంది. ఇది మెరుగైన కనెక్టివిటీ అని, పశ్చిమ ప్రాంతం అభివృద్ధితో దేశ ఆర్థిక ప్రగతికి ఊతం ఇస్తుందని ఆ లేఖలో సీఎం చంద్రబాబు వివరించారు. కర్ణాటక రాష్ట్రం హోస్పెట్, బళ్లారి ప్రాంతంలో ఖనిజ సంపద, ఐరన్‌కు కేంద్రంగా ఉంది. ప్రస్తుతం బళ్లారి, గుంతకల్లు, గుత్తి మీదుగా సరుకు రవాణా, ప్రయాణికుల రాకపోకలు జరుగుతున్నాయని, నూతన రైలు మార్గం నిర్మిస్తే.. తోర్నగల్లు-గుంతకల్లు/గుత్తి రైల్వే కారిడార్‌లోని రద్దీ, రవాణా ఒత్తిడిని తగ్గించవచ్చని వివరించారు. అదే క్రమంలో దక్షిణాది ప్రముఖ పుణ్య క్షేత్రం మంత్రాలయం రాఘవేంద్రస్వామి క్షేత్రాన్ని కలుపుతూ మంత్రాలయం రోడ్ స్టేషన్ నుంచి కొత్తగా ప్రతిపాదించే రైలుమార్గానికి అనుసంధానం (కనెక్టివిటీ) చేస్తే పర్యాటక రంగాన్ని మరింతగా ప్రోత్సహించవచ్చని ముఖ్యమంత్రి రాసిన లేఖలో వివరించారు. ఈ విషయంపై ఎంపీ బస్తిపాటి, ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం అభివృద్ధిని కాంక్షిస్తూ నూతన రైలుమార్గం ప్రతిపాదిస్తూ రైల్వే మంత్రి అశ్విన్‌వైష్ణవ్‌కు సీఎం చంద్రబాబు రాసిన లేఖను అందజేశామన్నారు. అలాగే స్థానిక ప్రజాప్రతినిధిగా మరో లేఖను అందజేశామన్నారు. రైల్వే మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. సర్వే, డీపీఆర్ తయారు చేసేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

20 ఎకరాల్లో మామిడి మొక్కలు తొలగింపు

- ఇరిగేషన్ భూముల్లో పంటలు సాగు చేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరిక


మామిడి మొక్కలను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

కొత్తపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కపిలేశ్వరం-సంగమేశ్వరం మధ్యలో శ్రీశైలం నీటి ముంపు నుంచి బయల్పడిన 20 ఎకరాల్లో రైతులు నాటుకున్న మామిడి మొక్కలను రెవెన్యూ అధికారులు బుధవారం తొలగించారు. దీంతో మామిడి మొక్కలు నాటుకున్న శ్రీశైలం నీటి ముంపు బాధిత రైతులు లబోదిబోమంటున్నారు. కపిలేశ్వరం గ్రామానికి చెందిన రైతులు పరమేశ్వరగౌడు, ఎల్లయ్య, నరసింహ, లింగస్వామి, దుబ్బన్న, ఈశ్వరగౌడులకు చెందిన 20 ఎకరాల్లో నాటిన మామిడి మొక్కలను రెవెన్యూ అధికారులు, పోలీసులు గ్రామ సేవకులతో కలిసి తొలగించారు. రైతులు మాట్లాడుతూ 30 ఏళ్లకు పైగా తమ పెద్దల హయాం నుంచి శ్రీశైలం ముంపు నుంచి బయల్పడిన ఇరిగేషన్ భూముల్లో వివిధ రకాల పంటలు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నట్లు చెప్పారు. అయితే ఉన్న ఫలంగా రెవెన్యూ అధికారులు పోలీసులతో కలిసొచ్చి నెలకింద నాటిన మొక్కలను పెరికేయడంతో తీవ్రంగా నష్టం కలిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై కొత్తపల్లి తహసీల్దార్ ఉమారాణిని వివరణ కోరగా శ్రీశైలం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రభుత్వ భూములను రైతులు ఎలా సాగు చేసుకుంటారని ప్రశ్నించారు. శ్రీశైలం ప్రాజెక్టు చెందిన ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు మామిడి మొక్కలను తొలగించినట్లు తెలిపారు. ఎవరైనా ఈ భూముల్లో పంటలను సాగు చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు

తప్పిన ప్రమాదం

- కిందికి దిగిపోయిన తెలుగుగంగ ప్రధాన కాలువ ఐదో బ్లాక్ షెట్టర్ రేకు
- తక్షణమే మరమ్మతులు చేపట్టిన అధికారులు


ఐదో బ్లాక్‌కు మరమ్మతులు చేయిస్తున్న అధికారులు

బండిఆత్మకూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ ప్రధాన కాలువ ఐదో బ్లాక్ కింద త్రుటిలో ప్రమాదం తప్పింది. మండలంలోని జీసీపాలెం, లింగాపురం, రామాపురం గ్రామాలకు చెందిన వేలాది ఎకరాలకు నీరు అందించే ఐదో బ్లాక్ తూమ్ షెట్టర్ రేకు పూర్తిగా కిందికి దిగిపోయింది. దీంతో రైతులకు నీరు అందక పోగా, రేకు మరింత కిందికి దిగపడిపోతే నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేయటం చాలా కష్టం. ఈ విషయాన్ని ఆయా టీడీపీ గ్రామాల నాయకులు శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే గంగ డీఈ మురళీకృష్ణ, ఏఈ అర్జున్ సింగ్‌ను మరమ్మతులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. దీంతో వారు హుటాహుటిన ఐదో బ్లాక్ తూము వద్దకు చేరుకుని, రైతుల సాయంతో దెబ్బతిని కిందకు దిగిపోయిన రేకును మరమ్మతులను చేసి సరిచేశారు. వెంటనే తూము కింద నీటిని వదిలారు. దీంతో రైతుల ఆనందం వ్యక్తం చేశారు.

ఆరేళ్లుగా బీజేపీ కాలయాపన

- రాయలసీమ డిక్లరేషన్‌పై ఎంపీలు ఒత్తిడి తేవాలి
- నేటికీ అమలు కాని 'ఆడబిడ్డ నిధి' హామీ
- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్


మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

ఆళ్లగడ్డ, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాయలసీమ డిక్లరేషన్ అమలు చేయకుండా బీజేపీ ప్రభుత్వం ఆరేళ్లుగా కాలయాపన చేస్తుందని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ విమర్శించారు. బుధవారం ఆయన ఆళ్లగడ్డలో విలేకరులతో మాట్లాడారు. రాయలసీమ డిక్లరేషన్ అమలుచేసి ప్రత్యేక ప్యాకేజీ కోసం ఎంపీలు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. సీమ అభివృద్ధి కోసం పదకొండేళ్లలో ఎంత బడ్జెట్ కేటాయించారో బీజేపీ నేతలు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి మహిళకు నెలకు రూ 1500 'ఆడబిడ్డ నిధి' పేరిట ఏటా రూ.18000 ఇస్తామని చెప్పిన హామీ నేటికీ అమలు కావడం లేదన్నారు. ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మాల్సి వస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు మహిళల ఆశలపై నీళ్లు చల్లినట్లు ఉందని విమర్శించారు. సమావేశంలో ఆళ్లగడ్డ సమన్వయకర్త బరగొడ్ల హుసేన్‌బాష, నంద్యాల పార్లమెంట్ జిల్లా అధికార ప్రతినిధి సంజీవకుమార్, సాధిక్ హుసేన్, హరూన్ రషీద్, రఫి, మహబూబ్‌బాష, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

ఆదోని రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకకు చెందిన గ్యాస్ సిలిండర్లను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం శిరుగుప్పకు చెందిన ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు అనుమతి లేకుండా ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామంలో విక్రయిస్తున్నారు. సమాచారం మేరకు. రెవెన్యూ, పోలీసులు స్వాధీనం దాడులు చేసి, దాదాపు 94 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తహసీల్దార్ రమేష్, ఇస్పీ పోలీసులు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న సిలిండర్లతో అధికారులు

మాజీ బ్యాంకు మేనేజర్ అరెస్టు

ఆదోని, జూలై30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మహాయోగి లకమ్మ బ్యాంకు మాజీ మేనేజర్ కమ్ సీఈవో గట్టు మురళికుమార్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ తెలిపారు. వివరాల మేరకు బ్యాంకులో సీఈవోగా విధులు నిర్వహించారు. పారిశ్రామికవేత్తలు ఎల్లే మల్లేశప్ప, ఎల్లే చెన్నబసవ, ఎల్లే చైత్ర పొలం పట్టాలు తనఖా పెట్టి నాలుగేళ్ల క్రితం రూ.3.24 కోట్ల రుణం పొందారు. రుణాన్ని తిరిగి చెల్లించకపోవడంతో అనుమానం వచ్చిన బ్యాంకు చైర్మన్ డాక్యుమెంట్లను పరిశీలించగా, అవి నకలీవని తేలింది. సబ్ రిజిస్ట్రార్ సంతకాలు, సీలు సైతం నకిలీవని గుర్తించిన బ్యాంకు చైర్మన్ రాయచోటి సుబ్బయ్య 2025 మార్చి 29న పోలీసులకు ఫిర్యాదు చేశారు. రుణ గ్రహీతలకు మాజీ మేనేజర్ కమ్ సీఈవో గట్టు మురళికుమార్ సహకరించినట్లు ఫిర్యాదులో పేర్కొనారు. ఈ కేసులో బుధవారం రాంజల రహదారిలోని వై జంక్షన్ వద్ద మురళికుమార్‌ను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేసినట్లు, మిగతా నిందితులను కూడా త్వరలో అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

మంత్రులకు ఆశీర్వచనాలు



మంత్రులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న అధికారులు

పాణ్యం, జూలై 30(ఆంధ్రజ్యోతి): మంత్రులు ఆనం నారాయణ రెడ్డి, బీసీ జనార్దనరెడ్డికి కొత్తూరు దేవస్థానం అర్చక సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం బనగానపల్లెలోని బీసీ జనార్దనరెడ్డి స్వగృహంలో ఆశీర్వచనాలు నిర్వహించినట్లు ఆలయ ఈవో రామకృష్ణ తెలిపారు. కొలిమిగుండ్ల మండలంలోని సిమెంటు ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో రూ. 7 కోట్లతో నిర్మించిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయ కుంభాభిషేకానికి హాజరైన మంత్రులను జిల్లా దేవదాయ శాఖ అధికారి మోహన్, అనంతపురం జిల్లా అధికారి తిరుమలరెడ్డి, కొత్తూరు ఈవో రామకృష్ణ, యాగంటి ఈవో పాండురంగారెడ్డి, కొత్తూరు దేవస్థానం అర్చకులు సురేష్ శర్మ, కిట్టయ్య, అధికార సిబ్బంది, నాయకులు మిలిటరీ సుబ్బారెడ్డి మంత్రులను సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలి

'పోరుబాట'లో ప్రజా సంఘాల నాయకులు



'పోరుబాట' నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఆత్మకూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని ప్రజా సంఘాల నాయకులు ఏసురత్నం, సుధాకర్, రణధీర్, సురేంద్ర, రామ్‌నాయక్, వీరన్న, దినేష్ డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని గరీబ్‌నగర్, స్వరాజ్‌నగర్, ఇందిరానగర్, సాయిబాబానగర్, ఏకలవ్యానగర్, లక్ష్మీనగర్ తదితర కాలనీల్లో 'పోరుబాట' కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామని, విద్యుత్ చార్జీలు పెంచమబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై భారం వేయడం సరికాదన్నారు. ఆయా సంఘాల నాయకులు నాగేశ్వరరావు, మహ్మద్, సత్యం, సామేలు, ఆశీర్వాదం, శివకుమార్ ఉన్నారు.

మహిళ ఆత్మహత్య

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుసులూరు గ్రామానికి చెందిన సహీరా(40) అనే మహిళ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తాలుకా పోలీసులు తెలిపిన వివరాలివీ.. సహీరా అనే మహిళ కడుపునొప్పి తాళలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సహీరా తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పంట నమోదు చేసుకోవాలి



కరివేనలో మొక్కజొన్న రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో

పాములపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు కచ్చితంగా పంట నమోదు చేయించుకోవాలని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సరళమ్మ, ఏవో హేమసుందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని ఇస్కాల గ్రామంలో ఏవో మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్కజొన్న పంటలో కత్తెరపురుగు నివారణ, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు, అన్నదాత సుఖీభవ పథకం గురించి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది గాయత్రి, రైతులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని రైతులు పంటల బీమా ఈ నెల 31వ తేది లోగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి హేమలత సూచించారు. మండలంలోని నల్లకాలువ, కరివేన గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా క్షేత్రస్థాయిలో మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ లబ్ధి పొందేందుకు రైతులు తమ బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ యాక్టివేషన్ తప్పని సరిగా చేసుకోవాలన్నారు. మండలంలోని రైతులు యూరియా గురించి ఆందోళన చెందనవసరం లేదని, ఆయా రైతు సేవా కేంద్రాల్లో రైతుల కవసరమైన నానో యూరియాను అందుబాటులో ఉంచామని తెలిపారు.అనంతరం నానో యూరియా వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్ ద్వారా నానో యూరియా ఎకరానికి 350 ఎంఎల్ పిచికారీ చేస్తే సరిపోతుందన్నారు. అనంతరం రైతులకు యూరియా పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సతీష్, రాజశేఖర్‌రైతు సేవా కేంద్రం సిబ్బంది పార్వతీబాయి, అశోక్ పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సేవలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి

నంద్యాల రూరల్, జూలై 30(ఆంధ్రజ్యోతి): శిల్పా సేవా సమితి ద్వారా ఏళ్లకు పైగా రాజకీయాలకు అతీతంగా సేవలు చేస్తున్నామని నంద్యాల మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శిల్పా మహిళా సహకార్ ఆధ్వర్యంలో బుధవారం రుణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. కొన్ని ఏళ్లకు పైగా నంద్యాలల్లోని మహిళలకు ఎటువంటి లాభాపేక్ష లేకుండా సేవలు చేస్తున్నామని తెలిపారు. ఎవరైన పట్టణాన్ని అభివృద్ధి చేయాలి కానీ వాటిని అడ్డుకోకూడదన్నారు. శిల్పా బ్యాంకు ద్వారా రూ.21.6 లక్షలు చెక్కులను 133 మందికి పంపిణీ చేశామని చెప్పారు. ప్రజలు నష్టపోకుండా మంచి పనులు చేయాలన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, శివనాగిరెడ్డి, మేనేజర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



పీరుసాహేబ్ పేట గ్రామంలో కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే

మిడుతూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య చెప్పారు. మండలంలోని పీరుసాహేబ్ పేట గ్రామంలో బుధవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే టీడీపీ గ్రామ నాయకులు సోమసుందర్ రెడ్డి, రామేశ్వర రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను అందచేశారు. గ్రామంలో ఉన్న సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి, నాయకులు శివరామిరెడ్డి, బీజేపీ రాజారెడ్డి, జయరాముడు, మహేశ్వరరెడ్డి, షబ్బుబాషా, వివిధ గ్రామాల నాయకులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ఉచిత యోగా శిక్షణ



శిక్షణ ఇస్తున్న గురువు బాలసుబ్రహ్మణ్యం

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం చంద్రావతి కల్యాణ మండపంలో దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ప్రముఖ యోగా గురువు గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం యోగా ప్రాశస్త్యాన్ని వివరిస్తూ స్థానికులు, భక్తులకు యోగా శిక్షణ నిచ్చారు. యోగా కార్యక్రమంలో ఆగమ పాఠశాల విద్యార్థులు, శివ సేవకులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు. ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరిపై యోగాపై అవగాహన కల్పించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో ఉచిత యోగా కార్యక్రమాన్ని వారంలో రెండు రోజుల పాటు ప్రతి మంగళ, బుధవారాల్లో యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బండిఆత్మకూరు ఖాజీగా షఫీవుల్లా



ఎమ్మెల్యే బుడ్డాకు కృతజ్ఞతలు తెలుపుతున్న ముస్లింలు

బండిఆత్మకూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): బండిఆత్మకూరు ప్రభుత్వ ఖాజీగా జీసీ పాలెంకు చెందిన షేక్ షఫీవుల్లాను ప్రభుత్వ ఖాజీగా నియమించారు. ఈ మేరకు జీసీ పాలెం ముస్లీం పెద్దలు స్థానిక టీడీపీ నాయకుడు కంచర్ల లింగారెడ్డి ఆధ్వర్యంలో ఎంఎల్ఏ బుడ్డా రాజశేఖర రెడ్డిని కలసి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ముస్లీం షాదీలు నిబంధనల అనుసారం నిర్వహిస్తానని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఖాజీ అన్నారు. కార్యక్రమంలో షేక్ బాబు, నహెంతుల్లా, హుస్సేన్, నబీరసూల్, షమీవుల్లా, జబీవుల్లా, మాబు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

దోమల వ్యాప్తిని అరికట్టాలి



దోమల నివారణ మందును పిచికారిని పరిశీలిస్తున్న అధికారి

కొత్తపల్లి, జూలై 30(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో మురికి కుంటలు డ్రైనేజీ కాలువలలో దోమల వ్యాప్తిని అరికట్టాలని జిల్లా మలేరియా నివారణ సబ్ యూనిట్ అధికారి కృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలోని ఎస్సీ కాలనీని బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వాతావరణం మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. వర్షాకాలంలో వర్షం నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమల వ్యాప్తి చెందకుండా ఫాగింగ్ చేయించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

మోసగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి



రామాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ జగన్మోహన్

బండిఆత్మకూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రజలు అత్యాశకు వెళ్లి మోసగాళ్ల చేతిలో బలికావొద్దని, అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జగన్మోహన్ సూచించారు. మండలంలోని రామాపురం గ్రామంలో బుధవారం రాత్రి ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకూడదని, మద్యం తాగి వాహనాలు నడుపకూడదని ఆదేశించారు. అనవసర గొడవలు చేసుకొని కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. దొంగల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

● పారిశ్రామికవేత్త ఆవుల వెంకటనారాయణరెడ్డి
● రూ.15 లక్షలతో నిర్మించిన తరగతి గదుల ప్రారంభం



తరగతి గదిని ప్రారంభిస్తున్న వెంకటనారాయణరెడ్డి

ఆత్మకూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పారిశ్రామికవేత్త, ఆవుల పుల్లారెడ్డి చారిటబుల్ ట్రస్టు అధినేత ఆవుల వెంకటనారాయణ రెడ్డి అన్నారు. ఈ ఏడాది జనవరిలో ఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవాల సమయంలో రూ.15 లక్షల వ్యయంతో కళాశాలలో అవసరమైన రెండు ఒకేషనల్ తరగతి గదులను నిర్మిస్తానని వెంకటనారాయణరెడ్డి హామీ ఇచ్చారు. నిర్మాణం పూర్తి కావడంతో బుధవారం తరగతి గదులను వెంకటనారాయణరెడ్డి, జయసుధ దంపతులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1986-87లో తాను ఇదే కళాశాలలో సీఈసీ చదివానని చెప్పారు. తన తల్లిదండ్రులు ఆవుల పుల్లారెడ్డి, రామకోటమ్మ దంపతుల జ్ఞాపకార్థం రూ.15 లక్షల వరకు ఖర్చు చేసి నూతన తరగతి గదులను నిర్మించినట్లు తెలిపారు. ఈ కళాశాలలో ఇంటర్ ఫలితాల్లో 1000 మార్కులకు 980కి పైగా సాధిస్తే రూ.లక్ష నగదు బహుమతి అందజేస్తానని ప్రకటించారు. డీఐఈవో సునీత, ఆత్మకూరు, నందికొట్కూరు, పాములపాడు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు సుంకన్న, రఘురామాచార్యులు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

బ్యాంకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



బ్యాంకు మేనేజర్‌కు నోటీసులు ఇస్తున్న ఎస్ఐ

వెలుగోడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బ్యాంక్ అధికారులు, సిబ్బంది అనుమానిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సురేశ్ సూచించారు. వెలుగోడు మండలంలోని ఆయా బ్యాంకు మేనేజరులను కలసి ఆయన నోటీసులు అందించారు. బ్యాంకుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, మాస్కులు, టోపీలు ధరించి బ్యాంకుకు వచ్చే వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంక్ అధికారులు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు. ఏమైనా సమస్యలు ఉన్నా, అనుమానిత వ్యక్తులు సంచరించినా తమకు సమచారం అందించాలని ఎస్ఐ కోరారు.

ట్యాంకులను శుభ్రం చేయాలి: సీపీఎం



నెహ్రూనగర్‌లో మినీ ట్యాంకును పరిశీలిస్తున్న నాయకులు

పగిడ్యాల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మినీట్యాంక్‌ల నుంచి నీరు వృథాగా పోవడంతో రోడ్ల వెంట నీరు ప్రవహించడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, నీటి వృథాను అరికట్టి శుభ్రం చేయాలని సీపీఎం మండల కన్వీనరు ఫక్కీర్‌సాహెబ్ కోరారు. నెహ్రూనగర్ గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలోని మినీ ట్యాంక్‌లను బుధవారం పరిశీలించి కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏళ్ల తరబడి ట్యాంక్‌ల నుంచి నీరు వృథాగా పారిపోతుండటంతో రోడ్డుపై ప్రవహించడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. అనునిత్యం ట్యాంక్ నుంచి నీరు పారిపోతుండటంతో ట్యాంక్ చుట్టు పాచి పేరుకుపోయిందన్నారు. అలాగే కాలనీలో నీరు ప్రవహించడంతో రోడ్డు బురదమయంగా మారి పాచి పట్టడంతో పలువులు జారి కిందపడుతున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. అపరిశుభ్రత కారణంగా ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. సీపీఎం నాయకులు ఈశ్వరమ్మ, బీరమ్మ, శ్రీరాములు పాల్గొన్నారు.

వీరభద్రస్వామికి విశేష పూజలు



పూజలందుకున్న వీరభద్రస్వామి

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో లోక కల్యాణార్థ వీరభద్ర స్వామికి బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయానికి ఉత్తర భాగంలో మల్లికాగుండానికి పక్కనే ఉన్న వీరభద్రస్వామికి ప్రదోశ కాలంలో విశేష పూజలు, అభిషేకాలు చేశారు. పంచామృతాలతో పాటు పలు రకాల ఫలాలతో అభిషేకాలు నిర్వహించార. అనంతరం స్వామివారికి పుష్పార్చన చేశారు.



హరికథాగానం వినిపిస్తున్న ప్రమీల

శివపార్వతుల కల్యాణంపై హరికథాగానం

శ్రీశైలం క్షేత్రంలో నిత్య కళారాధన కార్యక్రమంలో భాగంగా బుధవారం అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన భాగవతారిణి ప్రమీల శివపార్వతుల కల్యాణంపై హరికథాగానం వినిపించారు. దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద సాయంకాలం నుంచి కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తబలాను బాబురావు, హార్మోనియంను మురళి అందించారు. పెద్ద ఎత్తున భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తి ప్రశంసలు పొందారు.

అనుమతి లేని ప్లాట్లను క్రమబద్ధీకరించుకోండి

ఆత్మకూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అనుమతులు లేని ప్లాట్లు, లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేని ప్లాట్ల కొనుగోలు దారులకు ఎల్ఆర్ఎస్ నెంబర్ 2020 సవరణకు ప్రభుత్వం ఈ నెల 26వ తేదిన జీవో విడుదల చేసినట్లు తెలిపారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, పట్టణ ప్రజలు నిబంధనల్లోని సవరణ ప్రకారం ఈ ఏడాది జూన్ 30వ తేదీలోపు రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్లకు మాత్రమే క్రమబద్ధీకరణకు అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగే నిర్ధేశించిన తేదీలోపు కనీసం ఒక్క ప్లాట్ అయినా విక్రయించిన లే అవుట్లు మాత్రమే రెగ్యులర్ చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నందికొట్కూరు: అనుమతులు తీసుకోకుండా వేసిన అక్రమ లే అవుట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని పట్టణ ప్రణాళికా అధికారి రంగస్వామి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ జూన్ 30వ తేదీ నాటికి రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్లు, అనధికార లే అవుట్లను ఈ పథకం కింద క్రమబద్ధీకరించుకోవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని పట్టణంలోని లబ్ధిదారులు, రియల్టర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ఆత్మకూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రమేష్‌బాబు బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రతినెల జరిగే సాధారణ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో భాగంగా గురువారం ఉదయం 11గంటలకు మున్సిపల్ చైర్‌పర్సన్ మారూఫ్ ఆసియా అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు, కోఆప్షన్, ఎక్స్‌అఫిషియో సభ్యులు హాజరు కావాలని కోరారు.

2న మండల సర్వసభ్య సమావేశం

పాములపాడు, జూలై 30(ఆంధ్రజ్యోతి): పాములపాడులోని ఎంపీడీవో కార్యాలయంలో వచ్చే నెల 2న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అనివార్య కారణాల వల్ల 3న నిర్వహించాల్సిన ఈ సమావేశం 2న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలి పారు. మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మాట్లాడుతున్న రామ్‌నాయక్

ఆత్మకూరు, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన, స్కావెంజర్స్ కార్మికులకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ కోరారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం, స్కావెంజర్స్‌పై రాజకీయ వేధింపులను ఆపాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతగా నడుతున్నప్పటికీ కార్మికుల పట్ల ప్రభుత్వాలు వెట్టిచాకిరి చేయించడం సరికాదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను రూ.20 చొప్పున ఇవ్వాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం, స్కావెంజర్స్‌కు నెలకు రూ.10వేలు గౌరవ వేతనం చెల్లించాలన్నారు. అలాగే గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రమాద బీమా వర్తింపజేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, సెలవులు, మెటర్నరీ లీవ్స్ మంజూరు చేయాలని, రిటైర్డుమెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు ప్రభావతి, అహ్మద్‌బీ, హసీనా, ఈశ్వరమ్మ, ఖాజాబీ, హుసేన్‌బీ, రమిజాబీ, నాగమ్మబాయి తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజానికి కృషి చేద్దాం

నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను సమూలంగా నిర్మూలించి ప్లాస్టిక్ రహిత సమాజం కోసం విద్యార్థి దశ నుంచే కృషి చేద్దామని శ్రీ సంకల్ప్ పాఠశాల చైర్మన్ సుధాకర్, ప్రిన్సిపాల్ రమ్యారెడ్డి పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ రహిత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్‌లోని శ్రీ సంకల్ప్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. సుధాకర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ అనేక అనర్థాలకు దారితీస్తుందన్నారు. ప్లాస్టిక్ మహమ్మారిని నిర్మూలించేందుకు విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అనంతరం విద్యార్థులు ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాల గురించి వివరిస్తూ నిర్వహించిన ప్రదర్శనలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి

పాణ్యం, జూలై 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ శ్వేతకుమరి సూచించారు. ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన అభివృద్ధి సదుపాయాలు, అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యువత ఎంత త్వరగా తమ ఆలోచనలను వ్యాపార పరంగా అభివృద్ధి చేసుకోవచ్చో వివరించారు. అలాగే ప్రభుత్వ సంస్థల నుంచి లభించే ఇంక్యుబేషన్ సదుపాయాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జయచంద్రప్రసాద్, డీన్ డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ రామిరెడ్డి, కన్వీనర్ డాక్టర్ పివి గోపీకృష్ణారావు, ఐఐసీ కన్వీనర్ శాంతల పాల్గొన్నారు.

అధికారుల విచారణ



విచారిస్తున్న అధికారులు

గడివేముల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పైబోగుల గ్రామ సమీపంలో ఉన్న సోలార్ పరిశ్రమలో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వలేదని జాతీయ ఎస్టీ కమిషన్‌కు రైతులు ఫిర్యాదు చేయడంతో బుధవారం తహసీల్దార్ వెంకటరమణ విచారణ చేపట్టారు. క్షేత్రస్థాయికి వెళ్లి భూములను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి వారి వివరాలను సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదికలు అందజేస్తామని తెలిపారు. గిరిజన ప్రజాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్ మాట్లాడుతూ చెనకపల్లి రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 795, 797, 802లో రైతులకు ప్రభుత్వం పట్టాలను మంజూరు చేసి 1-బీ అడంగల్‌ను ఇచ్చిందని అన్నారు. రైతులు పూర్వం నుంచి భూముల్లో సాగు చేసుకుంటున్నారని అన్నారు. బాధిత రైతులకు నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ వెంకటరమణను కోరారు.

ప్రభుత్వ లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



పెద్దవంగలిలో జవాన్ మృతదేహం వద్ద గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

చాగలమర్రి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దవంగలి గ్రామానికి చెందిన జవాన్ అశోక్ (25) ఈనెల 28న విధులు నిర్వహిస్తూ శ్రీనగర్‌లో గుండెపోటుతో మృతి చెందాడు. బుధవారం ఉదయం అశోక్ మృతదేహాన్ని చాగలమర్రికి తీసుకొచ్చారు. పెద్దవంగలి, ఆయా గ్రామాలకు చెందిన యువకులు జవాన్ అశోక్ ఆత్మశాంతి కోసం మౌనప్రదర్శన ర్యాలీ చేశారు. 200 మంది యువకులు జాతీయ జెండాలతో ద్విచక్రవాహనాలపై ర్యాలీగా మృతదేహాన్ని గ్రామం వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాలతో మృతదేహంపై జాతీయ జెండా కప్పి గాలిలోకి మూడు రౌండ్లు కాల్పులు జరిపి అంత్యక్రియలు నిర్వహించారు. తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎస్ఐ సురేష్, ఆర్మీ సిబ్బంది, గ్రామస్థాయి అధికారులు, టీడీపీ ఆళ్లగడ్డ నియోజకవర్గ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి, నాయకులు మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దు



మాట్లాడుతున్న సీఐ గౌతమి

బనగానపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని జిల్లా దిశ పోలీస్‌స్టేషన్ సీఐ గౌతమి అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాలు, బాల్యవివాహాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆనందరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా ఉండాలి: డీపీవో

కోవెలకుంట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల రికార్డులు సక్రమంగా ఉండాలని డీపీవో లలితాబాయి ఆదేశించారు. బుధవారం కోవెలకుంట్ల గ్రామ పంచాయతీలో రికార్డులను డీపీవో పరిశీలించారు. అదేవిధంగా మండల జీపీలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ (చెత్తనుంచి సంపద సృష్టి) కేంద్రాన్ని కూడా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సంస్కృత పాఠశాల ఆవరణలోని శోన లింగేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వమిత్వ శిక్షణ ఇచ్చారు. సమావేశంలో తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, వీఆర్వోలు, సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, జూలై 29 (ఆంధ్రజ్యోతి): బైక్, సైకిల్ ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన పట్టణంలో బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన సాగిబండ యోసేపు (55) అనే వ్యక్తి సైకిల్‌పై ఇందిరమ్మ కాలనీ నుంచి బస్టాండ్ వైపు, సనా అనే వ్యక్తి ఇందిరమ్మకాలనీకి బైక్‌పై వెళ్తుండగా మార్కెట్‌యార్డు సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నారు. దాంతో సైకిల్‌పై ఉన్న యోసేపు కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కోవెలకుంట్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు బైకిస్ట్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

కోవెలకుంట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సంజామల మండలం ఆకుమళ్ల గ్రామానికి చెందిన తొమ్మిది మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లుఎస్ఐ మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పాత బస్టాడు సమీపంలో లక్కీ వైన్స్ షాపు వెనుకభాగంలో చెట్లలో కొంత మంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చింది. దాంతో సిబ్బందితో కలిసి దాడి చేసి తొమ్మిదిమందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వీరి వద్ద నుంచి రూ.38వేలు నగదు , పేకముక్కలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

సేవలు గుర్తుండిపోతాయి



ఎంఈవోలను సత్కరిస్తున్న ఎస్టీయూ నాయకులు

డోన్ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మనం చేసిన సేవలే చిరకాలం గుర్తుండిపోతాయని ఎంఈవో ప్రభాకర్ అన్నారు. బదిలీ అయిన ఎంఈవో-2 రామనర్సప్పకు, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈవో-2 రఘునాయక్‌కు ఎస్టీయూ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జేఎండీ ఇక్బాల్ బాషా, మౌలాలి, పి.శ్రీనివాసులు, వాణి శ్రీనివాసులు, డా.టి. సురేష్‌బాబు, డా.దేవేంద్రప్ప, భాస్కర్, విశ్వనాథ్, రామ్మోహన్, సురేంద్ర, మద్దిలేటి, కిరణ్, వెంకటేశ్వర్లు, సుంకన్న, ఆది, మస్తాన్‌వలి, నారాయణ, నందప్ప, మోహన్, మల్లికారుజన గౌడు ఉన్నారు.

నాణ్యమైన ఎరువులు విక్రయించాలి

రుద్రవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులనే విక్రయించాలని ఏవో సుమతి అన్నారు. బుధవారం మండలంలోని ఆలమూరు గ్రామంలో ఎరువుల దుకాణాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రైతుకు బిల్లు తప్పకుండా ఇవ్వాలన్నారు.

ఉపాధి హామీలో పండ్ల తోటల సాగు

ఆళ్లగడ్డ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నట్లు ఏపీవో వెంకటరమణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 109 ఎకరాలలో పండ్ల తోటల సాగు కోసం ఇప్పటికే రైతులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. మండలంలో ఎక్కువగా నిమ్మ సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. రాజమండ్రి నుంచి మొక్కలను తెప్పిస్తామన్నారు. సమావేశంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

రుద్రవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని సీఐ దస్తగిరిబాబు అన్నారు. బుధవారం కొత్తపల్లెలో మహిళలకు అవగాహన కల్పించారు. సిబ్బంది ఉన్నారు.

రైతన్నకు ఆర్థిక ధీమా

- 'అన్నదాత సుఖీభవ'కు 14,120 మంది రైతులు అర్హులు
- రైతు సేవా కేంద్రాల్లో జాబితా
- గ్రీవెన్స్ ద్వారా అభ్యంతరాలు స్వీకరణ
- ఆగస్టు 2న పీఎం కిసాన్‌తో పాటు నగదు జమ



పొలం పనుల్లో రైతన్న

డోన్ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అన్నదాతకు పెట్టుబడి కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం సిద్ధపడింది. పంట సాగు కోసం ప్రభుత్వాలు ప్రకటించిన పెట్టుబడి మొత్తాన్ని రైతన్న ఖాతాలో జమ చేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పథకం కింద, కేంద్ర ప్రభుత్వం 'పీఎం కిసాన్ సమ్మాన్ యోజన' కింద డబ్బులు ఆగస్టు 2న రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వ్యవ సాయ శాఖ అధికారులు తెలిపారు.

డోన్ మండలంలో 14,120 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. అనర్హుల జాబితా, ఈకేవైసీ చేయని వారి జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించారు. వ్యవసాయ శాఖ అధికారులు అర్హులైన రైతులందరికీ ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ పథకం (పీఎం కిసాన్)ను అమలు చేసే రోజే అన్నదా త సుఖీభవ పథకానికి సంబంధించి నిధులు విడు దల చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్‌ను మూడు విడతలుగా రూ.2వేల చొప్పున ప్రతి ఏడాది రూ.6వేలు పెట్టుబ డి సాయం కింద అందిస్తుండగా.. అన్నదాత సుఖీభవ పథకం కింద రాష్ట్ర ప్రభు త్వం మరో రూ.14వేలను అందించడంతో రైతుకు ఆర్థిక భరోసా కల్పిస్తుంది.

రైతుల అర్హుల జాబితా సిద్ధం

డోన్ మండలంలోని అన్నదాత సుఖీభవ పథకానికి 14,120 మంది రైతులను అర్హులుగా గుర్తించారు. ఈ జాబితాలోని వారందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే మొదటి విడత కింద రూ.7వేల నగదు చేస్తుంది. అలాగే మిగతా రెండు విడతలు కూడా రైతుల ఖాతాలో జమ చేయనుంది. ఏవైనా అభ్యంతరాలు ఉంటే గ్రీవెన్స్ ద్వారా స్వీకరించనున్నారు.

గ్రీవెన్స్ ద్వారా అభ్యంతరాలు పరిశీలన



అన్నదాత సుఖీభవ పథకానికి అర్హుల జాబితాను మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ప్రచురించాం. తొలి జాబితాలో పేర్లు నమోదు కానీ వారు గ్రీవెన్స్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటివరకు 30మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అర్హత ఉన్న దరఖాస్తులను అప్రూవల్ చేసి ఉన్నతాధికారులకు నివేదికలను పంపించాము. అర్హులైన రైతులందరికీ ఆగస్టు 2న నగదు జమ కానుంది.

● డి.శ్రీనివాసరెడ్డి, వ్యవసాయాధికారి, డోన్

ముగిసిన ఆలయ పునఃప్రతిష్ఠోత్సవాలు

కొలిమిగుండ్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో నాలుగు రోజులుగా కొనసాగిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునఃప్రతిష్ఠోత్సవాలు బుధవారం వైభవంగా ముగిశాయి. మహా సంప్రోక్షణ, కుంభాభిషేకం ఉత్సవాల్లో సుమారు ఐదువేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వ



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ



పూజల్లో పాల్గొన్న జడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే దంపతులు

హయాంలోనే లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధి కోసం విజ్ఞప్తి చేశామని, రామ్‌కో ఆధ్వర్యంలో కొలిమిగుండ్లలో నిర్మిస్తున్న కల్యాణ మండపం కోసం తామే భూమిని కేటాయించామని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. ప్రస్తుతం కల్యాణమండపం కూడా ప్రారంభ దశలో ఉందని, అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్న రామ్‌కో యజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. రామ్‌కో యజమాన్యం అన్నదాన కార్యక్రమం నిర్వహించింది.

సనాతన ధర్మ పరిరక్షణే ధ్యేయం

● దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి



మంత్రిని సత్కరిస్తున్న ఆలయ పూజలు

బనగానపల్లె, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సనాతన ధర్మ పరిరక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయమని దేవదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి అన్నారు. బుధవారం బనగానపల్లెలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి స్వగృహానికి మంత్రి ఆనం వచ్చారు. మంత్రులను నందవరం ఈవో శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ పీవీ.కుమార్‌రెడ్డి, , యాగంటి ఈవో పాండురంగారెడ్డి, కొత్తూరు సుబ్రమణ్యేశ్వరస్వామి ఈవో రామకృష్ణ, మంత్రాలయం ఆలయ అధికారులు, పూజారులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆలయాల పురోహితులు మంత్రులను ఆశీర్వాదించి తీర్థ ప్రసాదాలు, దేవుడి ప్రతిమలు అందించారు. ఆలయాల్లో జరగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి ఆనం రాంనారాయణరెడ్డికి వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దర్శనాలు చేయించాలని మంత్రి ఆనం కోరారు. ఆలయాల్లో సమస్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆలయాల్లో మంచి మొక్కలు నాటి ఆహ్లాదభరితంగా ఉండేలా చూడాలని మంత్రి కోరారు.

మంత్రిని సత్కరించిన బీసీ దంపతులు

కొలిమిగుండ్లలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మహాకుంభాభిషేకం, దివ్య కల్యాణోత్సవానికి హాజరైన దేవాదాయశాఖ మంత్రి ఆనం రాం నారాయణరెడ్డికి బన గానపల్లెలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, బీసీ ఇందిరమ్మ దంపతులు బుధ వారం స్వాగతం పలి కారు. ఈ సందర్భం గా ఆయన్ను సత్కరించి గణేశుడు, అయోధ్య బాలరాము డి ప్రతిమలు అందజేశారు. జిల్లా లోని పుణ్య క్షేత్రాలైన మంత్రాలయం, యాగంటి, మహానంది, నందవరం ఆలయాల అభివృద్ధిపై చర్చించారు.



మంత్రి ఆనంకు గణేశ్ ప్రతిమను అందిస్తున్న మంత్రి బీసీ దంపతులు

భూ కేటాయింపులో నిబంధనలను పాటించాలి: జేసీ



మ్యాపును పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్

సంజామల, జూలై 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల కేటాయింపులో నిబంధనలు పాటించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ ఆదేశించారు. బుధవారం మండలంలోని నొస్సం గ్రామంలో ఎకరున్ సోలార్ కంపెనీకి భూమి కేటాయింపు విషయంపై భూమిని పరిశీలించారు. కంపెనీ ప్రతిపాదనలకు కేటాయించాల్సిన భూమి విస్తీర్ణం, సాధ్యసాధ్యాలను ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పాటించాల్సిన నిబంధనలను అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సర్వేయర్లు తయారు చేసిన మ్యాపులను జేసీ పరిశీలించారు. అనంతరం వివిధ అంశాలపై ఆర్డీవో విశ్వనాథ్, తహసీల్దార్ అనిల్ కుమార్‌తో చర్చించారు. భూమి కేటాయింపులో తీసుకోవాల్సిన చర్యలను సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ భూమిని కేటాయించాల్సి వస్తోందని ఆ భూమికి సంబంధించి క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. పక్కాగా నియమనిబంధనలు పాటిస్తూ కంపెనీలకు భూములను కేటాయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సర్వేయర్లు మల్లేశ్వరి, కృష్ణయ్య, మండల సర్వేయర్లు వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి జాబ్‌కార్డులు అప్‌డేట్ చేయండి

రుద్రవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ జాబ్‌కార్డులు అప్‌డేట్ చేయాలని ఏపీవో గౌరీబాయి అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాలవారీగా ఉపాధి జాబ్‌కార్డులను అప్‌డేట్ చేయడంతో పాటు వర్క్‌ఫైళ్లను సిద్ధం చేయాలని సూచించారు. వీసీ సుబ్బన్న, సిబ్బంది పాల్గొన్నారు.

తెరుచుకున్న రైతు సేవా కేంద్రం

రుద్రవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రైతు సేవ కేంద్రం తాళం తెరుచుకుంది. రైతు సేవ కేంద్రానికి తాళం అనే కథనాన్ని ఈ నెల 23న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైంది. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు స్పందించారు. కోటకొండ రైతు సేవ కేంద్రానికి తాళం తీయించినట్లు ఏవో సుమతి బుధవారం తెలిపారు. మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాల్లోకి సమయపాలన పాటించి రైతులకు సేవలందించాలని ఆదేశించినట్లు ఏవో తెలిపారు.

అసంపూర్తి భవనాల పరిశీలన

రుద్రవరం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో అసంపూర్తిగా ఉన్న పాఠశాలల భవన నిర్మాణాలను ఎంఈవో వీరరాఘవయ్య బుధవారం పరిశీలించారు. అసంపూర్తి భవనాలు అంటూ ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైంది. దాంతో ఎంఈవో అప్పనపల్లె, రుద్రవరం మెయిన్, కొండమాయపల్లె పాఠశాలల భవనాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలల వారీగా నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

సీఎస్ఐ చర్చి ఎన్నికలు ఏకగ్రీవం

ఉయ్యాలవాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హరివరం గ్రామంలో జరిగిన సీఎస్ఐ పాస్టేట్ ఎన్నికలు ఏకగ్రీవం అయినట్లు ఆ సంఘ పెద్దలు బుధవారం తెలిపారు. పాస్టేట్ చైర్మన్‌గా ఎస్.ప్రభాకర్, సెక్రటరీగా సత్యబాబు, ట్రెజరర్‌గా శాంతయ్య, ప్లీనరీ కమిటీ మెంబరుగా లూకయ్య, పాస్టేట్ కమిటి కౌన్సిల్ మెంబరుగా స్వామిదాసులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పాస్టేట్ చైర్మన్‌ను సంఘ పెద్దలు సన్మానించారు.

రేపటి నుంచి రాజగోపుర ప్రతిష్ఠోత్సవాలు

ఉయ్యాలవాడ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంజేడు గ్రామంలో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరస్వామి రాజగోపుర కలశ ప్రతిష్ఠోత్సవాలు శుక్రవారం నుంచి జరగనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఆదివారం ఉదయం 11.30గంటలకు కుంభాభిషేకం, శిఖర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ ఉంటుందని వారు తెలిపారు. ప్రతి ఒక్కరూ వచ్చి గోపుర ప్రతిష్ఠను జయప్రదం చేయాలన్నారు.

భోజన ప్లేట్లు విరాళం

బేతంచెర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోర్లగుట్ట గ్రామానికి చెందిన దివంగత పుట్టనాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె స్వర్ణలత, రంగనాయకులు దంపతులు పాఠశాల విద్యార్థులకు భోజనం చేయడానికి వీలుగా వంద ప్లేట్లను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు మద్దిలేటి రెడ్డి, కృష్ణయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.



ప్యాపిలిలో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కోట్ల

పేదల సంక్షేమానికి ప్రాధాన్యం : ఎమ్మెల్యే కోట్ల

ప్యాపిలి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఊటకొండ, గోపాల్‌నగరం, ఎన్ రంగాపురం, ప్యాపిలిలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోట్ల మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. అయితే చంద్రబాబు సీఎం అయిన తర్వాత రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. వచ్చే నెల 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించనున్నారన్నారు. అలాగే సూపర్ సిక్స్‌ను దశల వారీగా అమలు చేస్తామని కోట్ల తెలిపారు. అనంతరం ఆయన ఇంటింటి తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వై లక్ష్మీనారాయణయాదవ్, టి శ్రీనివాసులు, చల్లా వీరాంజినేయులు, ఖాజాపీర్, రామ్మోహన్‌యాదవ్, పరమేష్, మధు, చల్లా అనుదీప్, నాగేంద్ర, పెద్దరామాంజినేయులు పాల్గొన్నారు.

రేపు బేతంచెర్లకు ఎమ్మెల్యే కోట్ల రాక

బేతంచెర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొనేందుకు శుక్రవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి హాజరు కానున్నారని టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య బుధవారం తెలిపారు. మండలంలోని గూటుపల్లె, హుసేనాపురం, రెహిమాన్‌పురం, నాగమల్లకుంట గ్రామాల్లో తొలి అడుగు కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కొండముచ్చు పట్టివేత

ప్యాపిలి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జలదుర్గం గ్రామంలో వారం రోజుల పాటు ప్రజలను వణికించిన కొండముచ్చును బుధవారం అటవీశాఖ సిబ్బంది పట్టుకున్నారు. చెట్టుపై కూర్చున్న కొండముచ్చుకు మత్తు ఇంజక్షన్ ఇచ్చి పట్టుకొని బోన్‌లో బంధించారు. అనంతరం డీఎఫ్‌వో నాగమహేశ్వరి ఆధ్వర్యంలో కొండముచ్చును అటవీప్రాంతానికి తరలించారు. వారం రోజుల పాటు ముచ్చెమటలు పట్టించిన కొండముచ్చును పట్టుకోవడంతో జలదుర్గం వాసులు ఊపిరి పీల్చుకున్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యత తనిఖీ

చాగలమర్రి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని సంతమార్కెట్ సమీపంలోగల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని బుధవారం ఎంఈవో న్యామతుల్ల తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల గ్రేడింగ్, రికార్డులను పరిశీలించారు. హెచ్‌ఎం శేషాద్రి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి అందరి బాధ్యత

చాగలమర్రి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి అందరి బాధ్యత అని ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ సహాయకులకు స్వమిత్వ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో తాహిర్‌హుసేన్, సిబ్బంది పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు

చాగలమర్రి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో రైతులు పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులు సాధించొచ్చని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు చెన్నయ్య, ఆళ్లగడ్డ ఏడీ విజయశేఖర్ తెలిపారు. బుధవారం పెద్దబోదనం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. మొక్కజొన్న, మినుము పంట సస్యరక్షణ చర్యల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏవోలు వెంకటేశ్వర్‌రెడ్డి, రంగనేతాజీ, ఏఈవో రేవతి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

షాట్‌పుట్, యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

చాగలమర్రి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని భారతీ విద్యామందిరం విద్యార్థులు యోగా, షాట్‌పుట్ పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఈనెల 26న బేతంచర్ల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో జగదీష్, అవినాష్‌రెడ్డి, ఉసేని పాల్గొని షాట్‌పుట్, యోగా, 400 మీటర్ల పరుగు పందెం పోటీల్లో గెలుపొందారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, షీల్డ్‌ను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి సుబ్బారావు, ఉపాధ్యక్షుడు ప్రభాకర్, సహాయ కార్యదర్శి సుంకు రాజేష్, హెచ్‌ఎం ప్రసాద్, కాంతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు అవుకు రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

అవుకు, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : అవుకు రిజర్వాయర్ నుంచి కడపకు రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి నీటిని విడుదల చేయనున్నట్లు టీడీపీ నాయకుడు అరుణ్‌కుమార్‌నాయక్ బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 8 గంటలకు అవుకు రిజర్వాయర్ సమీపంలో నిర్మించిన జీఎన్ఎస్ఎస్ వద్దకు మంత్రి బీసీ చేరుకొని గేట్లను ఎత్తి కృష్ణా జలాలను విడుదల చేయనున్నారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.55 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జీఎన్ఎస్ఎస్ కెనాల్ నీటి ప్రవాహ సామర్థ్యం 20 వేల క్యూసెక్కులు. అయితే గోరుకల్లు నుంచి బుధవారం సాయంత్రం ప్రస్తుతం 2 వేలు క్యూసెక్కుల నీటిని జీఎన్ఎస్ఎస్ కెనాల్‌కు విడుదల చేశారు.

సకాలంలో పింఛన్లు అందించాలి

ఆళ్లగడ్డ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని రకాల పింఛన్లు సకాలంలో అందిచాలని ఎంపీడీవో నూర్జహాన్ తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కొత్తగా బదిలీల పై వచ్చిన సచివాలయాల అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాలొన్నారు.

తిరుపతి ట్రైన్ స్టాపింగ్‌కు అనుమతి

కోవెలకుంట్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): గుంటూరు -తిరుపతి రైలు కోవెలకుంట్ల రైల్వేస్టేషన్‌లో నిలిపేందుకు సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వేశాఖ అధికారులు అనుమతులు ఇచ్చినట్లు స్టేషన్ మాస్టర్ గురుచరణ్ ప్రసాద్ బుధవారం తెలిపారు. ఆగస్టు 2నుంచి రైళ్లు నిలుస్తాయని స్టేషన్ మాస్టర్ తెలిపారు. ప్రయాణికులు, ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

రస్తా విషయంలో ఘర్షణ

బేతంచెర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పొలం రస్తా విషయంలో బుధవారం పాపసాని కొట్టాల గ్రామంలో ఘర్షణ చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన రామ తిమ్మారెడ్డిపై అతడి తమ్ముడు తిమ్మారెడ్డి మరదలు కట్టెలతో దాడి చేసి గాయపరిచారు. బాధితుడిని చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు తిమ్మారెడ్డి, అతడి భార్య రమణమ్మలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు.

అర్హులను నియమించాలి

డోన్ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): డోన్ ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాల్లో అర్హులను ఆయాలను నియమించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జి.షేభారాణి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి.శివరాం కోరారు. బుధవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో షంషాద్‌భేగంను కలిసి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్షుడు నక్కి శ్రీకాంత్, అంగన్‌వాడీ యూనియన్ డోన్ సెక్టార్ అధ్యక్షురాలు సులోచనమ్మ, సుమలత, రహిమత్‌బీ, యశోద, శకుంతల, ఈశ్వరమ్మ, తిప్పమ్మ, శోభారాణి, దేవమ్మ,పరమేశ్వరమ్మ, ఐద్వా నాయకురాలు షమీం భేగం పాల్గొన్నారు.